క్లుప్తంగా

ఆర్డీఓకు వినతి



ఆర్డీఓకు సమస్యలను వివరిస్తున్న శ్రీనివాస్

కల్లూరు: రైతుల భూ సమస్యలు పరిష్కరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ కల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం ఆర్డీఓ సీహెచ్ సూర్యనారాయణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా చాలా మంది రైతుల భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి త్వరితగతిన అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు దుస్సా వెంకటేశ్వర్లు, కల్లూరు పట్టణ అధ్యక్షుడు బొడ్డు కృష్ణ, నాయకులు ప్రసాద్, బెజవాడ సాయి, శేషు తదితరులు పాల్గొన్నారు.

టీబీపై అవగాహన



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

మధిర: మధిరలోని దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. పారామెడికల్ సిబ్బంది ఇంటింటికీ తిరిగి టీబీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ పృథ్వీ నాయక్ మాట్లాడుతూ.. ఈ నెల 24న ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జన సమూహ ప్రాంతాల్లో క్షయ వ్యాధిపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గోలి రమాదేవి, గోవింద్, లంకా కొండయ్య, కౌసల్య, సందీప్, శివ, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వితరణల వెల్లువ..

క్రీడాకారులకు దుస్తులు..



క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న నాగ గౌడ్

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ జెర్రి పోతుల నాగ గౌడ్ తన సోదరుడు జెర్రిపోతుల పుల్లారావు జ్ఞాపకార్థం తనికెళ్లలోని కబడ్డీ క్రీడాకారులకు రూ.15 వేలు విలువైన దుస్తులను వితరణ చేశారు. గత ఏడాది రోడ్డు ప్రమాదంలో పుల్లారావు మృతి చెందాడు. సోదరుని జ్ఞాపకార్థం జేపీ మెమోరియల్ క్రీడా దుస్తులు అందజేసినట్లు తెలిపాడు. ఈ కార్యక్రమంలో కొనకండ్ల జానీ, పొట్లపల్లి సరవయ్య ఆజామ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు..

కల్లూరు రూరల్: మడలంలోని లక్ష్మీపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి గ్రామసర్పంచ్ లక్ష్మి కుర్చీలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ నాగమణి, ప్రసాద్, లాలు, మోతిలాల్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

‘సీసీ’లను అమర్చుకోవాలి

ముదిగొండ: ముదిగొండలోని ప్రధాన రహదారుల వెంట ఉన్న ప్రతీ దుకాణదారుడు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని ఎస్సై నాగరాజు సూచించారు. ముదిగొండ పోలీస్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం పలు దుకాణదారులకు సీసీ కెమెరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేర నియంత్రణ కోసమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్న నేరాలను, ఘర్షణలను నియంత్రించే అవకాశం ఉందని అన్నారు.

మన్విత్‌కు అభినందన

సత్తుపల్లిటౌన్: మల్టీ టాలెంటెడ్ క్విడ్‌గా రికార్డులు సొంతం చేసుకున్న సత్తుపల్లి విశ్వశాంతి విద్యార్థి బొర్రా మన్విత్ జగన్నాథ్‌ను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు చింతపట్ల వెంకటాచారి అభినందించారు. కార్యక్రమంలో తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్స్ బాధ్యులు బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, విశ్వశాంతి స్కూల్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, సృజన సాహితీ నిర్వాహకులు జి.రామకృష్ణ, బి.మధుసూదన్‌రాజు, జి.వాసు, గంద్ర కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

పది క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

ముదిగొండ: మండలంలోని బాణాపురంలో ఓ ఇంట్లో నిల్వ చేసిన పది క్వింటాళ్ల రేషన్ బియ్యంను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రవీంద్ర తెలిపారు. ముదిగొండ ఎస్సై నాగరాజు, సిబ్బందితో పాటు టాస్క్‌ఫోర్స్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యాన దాడులు చేసి పట్టుకున్న బియ్యంను సివిల్ సప్లయిస్ అధికారులకు అప్పగించామని పేర్కొన్నారు.

‘స్వశక్తి’కి ప్రోత్సాహం

కల్లూరు ఐకేపీ పరిధిలో ఎస్‌హెచ్‌జీలకు రూ.65.33 కోట్ల రుణాలు

- స్త్రీనిధి లక్ష్యం రూ.5.25 కోట్లు.. ఇచ్చింది రూ.5.61 కోట్లు
- గ్రామ సమాఖ్యలకు వడ్డీలేని రుణాలు రూ. 2.75 కోట్లు
- ఎస్‌హెచ్‌జీల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సెర్ప్



కల్లూరు ఐకేపీ కార్యాలయం

కల్లూరు: మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసే దిశగా తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) కృషి చేస్తుంది. పేద మహిళల జీవనోపాధి కొరకు సెర్ప్ ఆధ్వర్యంలో పొదుపు, శ్రీనిధి, బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలను అందిస్తూ ప్రభుత్వం చేస్తున్న సేవలు సఫలమవుతున్నాయి. కల్లూరు ఇందిరా క్రాంతి పథం కార్యాలయం పరిధిలో 46 గ్రామ సమాఖ్యలలో 1579 గ్రూపులలో 15,790 మంది ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఉన్నారు. మొత్తం 1403 సంఘాలకు రూ.79.11 కోట్ల మేర రుణాలు అందించాల్సి ఉండగా.. 890 సంఘాలకు రూ.65.33 కోట్ల రుణాలు అందించారు. తీసుకున్న రుణాలతో సభ్యులు వ్యవసాయం, వ్యవసాయేతర అవసరాలు, పాడి గేదెలు, ఇతర చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ జీవనోపాధిని పొందుతున్నట్లు ఏపీఎం ఎం.వెంకట్రామారావు పేర్కొన్నారు. మహిళా సభ్యులు తీసుకున్న రుణాలకు సంబంధించి 98 శాతం రికవరి ఉంది.

స్త్రీనిధి రుణాలు రూ.5.61 కోట్లు..

గ్రామ సంఘాల్లో స్త్రీనిధి రుణాలు తీసుకునేందుకు అర్హులైన 249 సంఘాలకు రూ.5.25 కోట్లు ఇవ్వాల్సి ఉండగా లక్ష్యాన్ని అధికమించి రూ.5.61 కోట్లు అందజేశారు. తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లిస్తూ రుణదారులు ముందుకు సాగుతున్నారు.

వడ్డీలేని రుణాలు రూ.2.75 కోట్లు..

2018-19, 2019-20 కి సంబంధించి ప్రభుత్వ వడ్డీలేని రుణాల కింద మంజూరు పత్రాలు ఇవ్వడం జరిగింది. 1403 గ్రామ సంఘాలకు రూ.2.75 కోట్లు ఆయా గ్రూపుల వారీగా బ్యాంక్ పొదుపు ఖాతాలలో జమ చేస్తారు. అదే విధంగా సీఐఎఫ్ (కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్) కింద రూ.14 లక్షలు ఇవ్వడం జరిగింది.

పీఎంఎఫ్ఎంఈ ద్వారా 20 యూనిట్లు..

పీఎంఎఫ్ఎంఈ పథకం (ప్రైమ్ మినిస్టర్ ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్) ద్వారా ఆహార ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు గాను పిండిమిల్లు, కారం మిల్లులు, చిల్లీ పౌడర్, పచ్చళ్ల తయారీ, బేకరీ ఐటెమ్స్, స్వీట్‌షాపులు, గానుగ నూనె తయారీ కర్మాగారాలు తదితర పథకాలకు సంబంధించి 20 యూనిట్లు మంజూరు అయ్యాయి. ఈ యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు 35 శాతం సబ్సిడీతో కూడిన రుణాలు అందజేస్తారు.

రుణాలు సకాలంలో చెల్లించండి..



సభ్యులు తీసుకున్న బ్యాంక్ లింకేజీ రుణాలకు సంబంధించి సకాలంలో చెల్లించాలి. లబ్దిదారులు అందించే రుణాలతో వారు ఆర్థికంగా మెరుగుపడేలా కృషి చేస్తున్నాం. ఈ రుణాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. తద్వారా తమ కుటుంబ అవసరాలు తీరడంతో పాటు జీవనోపాధి పొందవచ్చు.

– ఎం.వెంకట్రామారావు, ఏపీఎం, కల్లూరు

సభ్యులు పొదుపు పెంచాలి..



గ్రామ సమాఖ్యలు పొదుపుల శాతం పెంచాలి. సభ్యురాళ్లు ప్రస్తుతం నెలకు రూ.100 నుంచి రూ.200 మాత్రమే చెల్లిస్తున్నారు. ప్రభుత్వం ఒక్కో సంఘానికి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తుంది. ఏప్రిల్ నుంచి ప్రతి సభ్యురాలు రూ.300 నుంచి రూ.500 వరకు పొదుపులు పెంచేలా వారిని చైతన్య పరుస్తాం.

– ఎస్ జనార్ధన్, డీఎంజీ, ఖమ్మం

బాలికలకు ఆయుష్ కిట్లు పంపిణీ

ఏన్కూరు/కల్లూరు/ముదిగొండ: మండల కేంద్రంలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం ఆయుష్‌కిట్లను ఎంపీడీఓ బయ్యారపు అశోక్ పంపిణీ చేశారు. అంతే కాకుండా పెనుబల్లి మండలంలోని కస్తూర్బి బాలికల రెసిడెన్సియల్ పాఠశాలలో పెనుబల్లి ప్రభుత్వ వైద్యశాల హోమియో వైద్యుడు బి.శ్రీనివాస్ నాయక్ ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించి విద్యార్థినులకు ఆయుష్ కిట్లు అందించారు. కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు, ముదిగొండలోని కేజీబీవీ పాఠశాల, కళాశాలలోని విద్యార్థుకు, గ్రామ పంచాయతీలో పెనుబల్లి ప్రభుత్వ హోమియో వైద్యుడు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.శ్రీనివాస్ నాయక్, ఆయూష్ వైద్య సిబ్బంది ఎం.వెంకటేశ్వరరావు, జి.రామ్‌ప్రసాద్, యునాని డాక్టర్ శంకర్‌లు పదో తరగతి విద్యార్థులకు ఆయూష్ కిట్లు, స్కూల్ పిల్లలకు రాగి లడ్డూలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆయుష్ కిట్‌లో ఆల్పా అల్పా సిరప్ ఆకలిని పెంపొందింప జేసి శారీరక పెరుగుద, మానసిక ఒత్తిడిని తగ్గిస్తుందన్నారు. బాలికలకు పరీక్షల సమయంలో ఈ మందు బాగా ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేష్, ఆయుర్వేద వైద్యుడు శంకర్, సిబ్బంది అరుణ, శైలజ, ప్రధానోపాధ్యాయులు సుభాషిణి, ఉషారాణి, ఎంపీపీ బీరవల్లి రఘు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఇస్మాయిల్, ప్రధానోపాధ్యాయుడు జి.మాధవరావు, వనదుర్గ, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఇందిర, సర్పంచ్ వాగదాని కన్నయ్య, వైద్య సిబ్బంది ఆశ, సూర్యకళ, శ్రీనివాస్, జెడ్పీటీసీ మోహన్‌రావు, ఎంపీపీ అలేఖ్య, అశోక్‌కుమార్, ప్రసాద్, భూపాల్‌రెడ్డి, లక్ష్మణరావు, భద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఏన్కూరు: విద్యార్థులకు ఆయుష్ కిట్లు అందిస్తున్న ఎంపీడీఓ అశోక్

పోషకాహారంతోనే ఆరోగ్యం



గోవిందాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

బోనకల్: మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీడీపీఓ కమలప్రియ మాట్లాడుతూ.. పోషకాహారం తీసుకుంటే అంతా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పక్షోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీల్లో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు రాణి, జయలక్ష్మీ, విజయ, రమాదేవి, నిర్మల, శైలజ, పద్మ, అనిత పాల్గొన్నారు.

ఆహార పిరిమిడ్‌పై అవగాహన..

వైరారూరల్: మండలంలోని తాటిపూడి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ‘పోషణ పక్షం’కార్యక్రమాన్ని నిర్వహించి ఆహార పిరిమిడ్‌పై అవగాహన కల్పించారు. బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన ఆహార నియమాలను తెలియజేశారు. చిన్నారులు ఆరోగ్యవంతంగా ఉండేందుకు బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ భట్టా పెద్దభద్రయ్య, ఉపసర్పంచ్ మన్నెం సత్యానందం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాలతి, పంచాయతీ కార్యదర్శి వేణు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్ పాస్‌లు అందజేత

తల్లాడ: మండలంలోని రైతు వేదికలో దివ్యాంగులకు పంచాయతీ సర్పంచ్‌ల సహకారంతో బస్సు పాసులను పంపిణీ చేసింది. సంవత్సరం గుడువుతో 50 శాతం రాయితీ కలిగిన బస్‌పాస్‌లను ఎంపీడీఓ బి.రవీంద్రరెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మేజర్ పంచాయతీ సర్పంచ్ సంధ్యారాణి, ఈఓ వై.సువర్ణ ఉమా, ఆర్టీసీ సిబ్బంది ఎస్‌కే.మునీర్ పాషా, కిన్నెర ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు బస్ పాస్‌లు అందిస్తున్న ఎంపీడీఓ రవీంద్రరెడ్డి

ఘనంగా బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

తల్లాడ: ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నూతనకల్ గ్రామంలో మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి బీఆర్ఎస్ చేసిన కృషిని వివరించారు. ఇంకా గ్రామానికి కావాల్సిన నిధులను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజవర్గ ఆత్మ కమిటీ డైరెక్టర్‌గా రెండోసారి ఎన్నికైన శెట్టిపల్లి లక్ష్మణ్‌రావును సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు, రైతు బంధు మండల కన్వీనర్ దుగ్గిదేవర వెంకట్‌లాల్, వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దూపాటి భద్రరాజు, దిరిశాల దాసురావు, జీవీఆర్, నాయుడు శ్రీనివాసరావు, పాపారావు, చంద్రయ్య పాల్గొన్నారు.



సత్తుపల్లిరూరల్: సమావేశంలో పాల్గొన్న యాగంటి శ్రీనివాసరావు, నాయకులు

ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతం చేయండి..

సత్తుపల్లిరూరల్: మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం ఆత్మీయ సమ్మేళనాల విజయవంతం కోసం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆధ్వర్యంలో నిర్వహించే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, హరికృష్ణారెడ్డి, శంకర్‌రావు, జెడ్పీటీసీ సభ్యుడు రామారావు, కృష్ణారెడ్డి, వాసురెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

కల్లూరు రూరల్: మండలంలోని చెన్నూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, రక్తహీనత, థైరాయిడ్, రొమ్ము పరీక్షలు, కేన్సర్, స్క్రినింగ్, నెలసరి తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇష్రత్ తబుస్సుమ్ మాట్లాడుతూ.. ప్రతీ మంగళవారం ఆస్పత్రిలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ ప్రారంభం

తల్లాడ: మండలంలోని మిట్టపల్లి గ్రామంలో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు ప్రారంభించారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాగంటి కృష్ణయ్య, ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, వైద్యాధికారి రత్న మనోహర్, ఎంపీఓ కె.శ్రీదేవి, కోపెల కనకయ్య, తూము వీరభద్రరావు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో ఉన్నా

ఎర్రుపాలెం: తెలంగాణా రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారుడిగా నియోజకవర్గ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నానని బీఆర్ఎస్ పార్టీ నియోజవర్గ మాజీ ఇన్‌చార్జ్ బొమ్మెర రామ్మూర్తి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ ఎమ్మెల్యే లేకపోవడంతోనే ఆశించిన స్థాయిలో నియోజకవర్గ అభివృద్ధి జరగలేదన్నారు. ఈసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా నేనే ఉండి గెలుస్తానన్నారు. ఈ సమావేశంలో జాగృతి కన్వీనర్ బాబురావు, పెద్దగోపవరం సర్పంచ్ శివాజీ, నాయకులు తదితరులు ఉన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

సత్తుపల్లిరూరల్: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ అటవీ దినోత్సవం సందర్భంగా సత్తుపల్లి జేవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు మండలంని జగన్నాథపురం అటవీ ప్రాంతంలో వేప, చింత, సీమచింత మొక్కలను నాటారు.

పంటల పరిశీలన

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం పరిసర గ్రామాల్లో అకాల వర్షం కారణంగా నష్టపోయిన మొక్కజొన్న పైరును మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ ఎండీ.తాజుద్దీన్, రైతు బంధు మండల కన్వీనర్ డి.వెంకట్‌లాల్, ఏఈఓ హసీనా, శీలం కోటారెడ్డి, దొడ్డా చిన్న శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జనచైతన్య యాత్రకు మద్దతుగా ర్యాలీ

పెనుబల్లి: తల్లాడ మండలంలోకి సోమవారం ప్రవేశించిన జన చైతన్య యాత్రకు మద్దతుగా సీపీఎం పెనుబల్లి మండల శాఖ ఆధ్వర్యంలో ర్యాలీగా తరలివెళ్లారు. మండలానికి చెందిన 80 మంది సీపీఎం కార్యకర్తలు ఆటోలు, ద్విచక్రవాహనాలతో జన చైతన్య యాత్రకు మద్దతుగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు చలమాల విఠల్‌రావు, గాయం తిరుపతిరావు, పోట్రు రాజారావు, కండె సత్యం, గుడిమెట్ల బాబు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కొణిజర్ల: నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ అన్నారు. కొణిజర్ల మండలం బస్వాపురం రైతు వేదిక భవనంలో మంగళవారం తహసీల్దార్ దొడ్డారపు సైదులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులక ఇళ్ల పట్టాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఓ నంబర్ 58, 59 ప్రకారం నిరుపేదలు ఆక్రమించుకున ఇళ్ల స్థలాలకు పట్టాలు అందిచడం జరిగిందన్నారు. కేంద్రం అక్కసు తోనే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై ఈడీ దర్యాప్తు చేపిస్తుందని, భవిష్యత్తులో బీజేపీని ప్రజలు తరిమి కొట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.రమాదేవి, ఏఓ బాలాజీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చిరంజీవి, కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నాయకులు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

విద్యార్థి దశ మరుపురానిది..

వైరారూరల్: విద్యార్థి దశ మరుపురానిదని ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ అన్నారు. వైరాలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకోని నిర్వహించిన వైరా మండల ఉపాధ్యాయులు, కవులు, కళాకారులకు కవి సమ్మేళనం సన్మానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తాను చదువుకునే రోజుల్లో రవాణా సౌకర్యం లేకపోయిన కిలోమీటర్లు నడిచి వెళ్లి చదువుకున్నట్లు వివరించారు. నేను పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించి ఎస్సైస్థాయి వరకు పనిచేశానన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బీడీకే రత్నం, ఎంపీపీ పావని, జెడ్పీటీసీ కనకదుర్గ, మున్సిపల్ వైస్ చైర్మన్ సీతారాములు, ఎంపీడీఓ శ్రీదేవి, ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలని రైతుల వినతి

తల్లాడ: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. స్థానిక రింగ్ రోడ్డు సెంటర్ నుంచి మొక్క జొన్న కర్రలతో రైతులు ప్రదర్శనగా తహసీల్‌కు చేరుకొని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి సమస్యలపై తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ.. ఎకరానికి రూ.50 వేలు నష్టపరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటరామారావు, నియోజకవర్గ కన్వీనర్ వీర్రాజు, జిల్లా కార్యదర్శి నాయుడు రాఘవరావు, నాని, కృష్ణారావు, సురేష్, కృష్ణ, పంపాద్రి, నరసింహారావు, రామారావు పాల్గొన్నారు.



తల్లాడ: తహసీల్‌లో వినతిపత్రం అందిస్తున్న రైతులు, నాయకులు

అదనపు కలెక్టర్‌కు వినతి..

కొణిజర్ల: మండలంలోని పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని పొంగులేటి అభిమాన సంఘం నాయకులు అదనపు కలెక్టర్ మధుసూధన్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పెద్దమునగాల సర్పంచ్ శ్రీనివాసరావు మాట్లాడారు. వర్షాలతో తనికెళ్ల, పెద్దమునగాల, పెద్ద గోపతి, గోపవరం గ్రామాల్లోని రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కార్యక్రమంలో యల్లయ్య, మురళి, శ్రీనివాసరావు, వీరబాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం సహకారనగర్: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన తమకు పరిహారం అందేలా చూడాలని కొణిజర్ల మండలం తుమ్మలపల్లి రైతులు కోరారు. ఈమేరకు కలెక్టరేట్‌కు మంగళవారం వచ్చిన పలువురు రైతులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు, నాగేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ అకాల వర్షాలతో సుమారు 1,250 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం జరిగిందని తెలిపారు. రైతులు రాందాస్, వెంకట రామయ్య, శ్రీను, నర్సింహరావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల ఇంట్లో వెలుగు



కాంగ్రెస్ డిక్లరేషన్ కరపత్రం అందిస్తున్న సంభాని

కల్లూరు రూరల్: కాంగ్రెస్‌తోనే పేదల ఇంట్లో వెలుగు అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా 21వ రోజున మండలంలోని తూర్పులోకవరం, పడమర లోకవరం, పాయపూరు, హనుమతాండ గ్రామాల్లో జెండాలు ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ మోసపూరితమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా సంక్షేమాన్ని తుంగలో తొక్కిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు 2లక్షలు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని, రూ.500లకే గ్యాస్‌బండ, ఇందిరమ్మ ఇంటికి 5లక్షలు, ఏడాదికి 2లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు బైరెడ్డి మనోహర్ రెడ్డి, కిరణ్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, కృష్ణ, పుల్లారావు, నరేంద్ర, శివ, చుక్కా, కుటుంబరావు, నరేష్, శంకర్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కేరళలో శిక్షణకు సత్తుపల్లి కమిషనర్



కోజికోడే మున్సిపల్ అధికారులతో కమిషనర్ సుజాత

సత్తుపల్లిటౌన్: రాష్ట్రంలోని తొమ్మిది మంది అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యుల బృందం కేరళ రాష్ట్రంలోని కోజికోడే మున్సిపల్ కార్పొరేషన్, వడేకర మున్సిపాలిటీల్లో ఈనెల 17నుంచి మంగళవారం వరకు పర్యటించింది. ఈ బృందంలో సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు ఉష ఉన్నారు. ఈసందర్భంగా అక్కడ జరిగిన స్వచ్ఛోత్సవ్-2023 సదస్సులో పాల్గొన్నవారు తడి, పొడి చెత్త నిర్వహణ, మహిళా ఎస్‌హెచ్‌జీ సభ్యుల అనుభవాలపై అధ్యయనం చేశారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

బోనకల్/సత్తుపల్లిరూరల్: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయాల్లో మంగళవారం సెర్ప్ ఉద్యోగులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం పద్మలత, సుబ్బారావు మాట్లాడుతూ.. జీతాలు పెంచడంతో పాటు పేస్కేల్ ఇవ్వడం ద్వారా మా జీవితాలలో వెలుగుల నిండాయన్నారు.మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇస్తునందుకు కృతజ్ఞతలు తెలిపారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వేణుమాదవ్, ఎంపీపీ కంకణాల సౌభాగ్యం, సీసీలు పి.రామారావు, ఎం.శ్రీనివాస్, పి.కృష్ణయ్య, ఎన్.నరేందర్, గురవయ్య, ఇందిరా, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

24న బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

కారేపల్లి: ఈ నెల 24న మండలంలోని పేరుపల్లి గ్రామంలో 10 గ్రామ పంచాయతీల బీఆర్ఎస్ కార్యకర్తలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పెద్దబోయిన ఉమాశంకర్, ఇస్లావత్ బన్సిలాల్‌లు మంగళవారం తెలిపారు. దీనికి సంబంధించి పేరుపల్లి గ్రామంలో గురువమ్మతల్లి దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసే సభావేదికకు స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, సర్పంచ్ అజ్మీర నాగేశ్వరరావు, ముత్యాల సత్యనారాయణ, అజ్మీర వీరన్న, ఐలయ్య, కుమార్, ఉపేందర్, నరేష్, మౌలాలీ, మంగీలాల్, రఘు, శ్రీనివాసరావు, కోటి తదితరులు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

ఇటీవల కురిసిన వర్షాలకు మధిర మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడగా, మరికొన్ని ఒరిగిపోయాయి. దీంతో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. దీనివల్ల విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడటంతో పాటు పొలం పనులకు వెళ్లే రైతులు, వ్యవసాయ కూలీలకు విద్యుత్ తీగలు ప్రాణాంతకంగా మారాయని ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ లైన్లను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

– మధిర

ప్రశ్నించాల్సిన అధికారి : నాగేశ్వరరావు, విద్యుత్ శాఖ రూరల్ ఏఈ, మధిర
సెల్ నంబర్ : 9491058652

